# మురుగుల జత

శ్రీరంగపు సరస్వతి



'అత్తమ్మా అత్తమ్మా నిన్ను అర్జెంటుగా రమ్మని నాయన పంపిండు'' ఒగర్చుకుంటూ వచ్చింది శాయి.

చుట్టు గుడిసెలో వట్టింట కొంగు పరచుకొని పడుకున్న రంగమ్మ కళ్ళు నులుపుకుంటూ లేచింది తల వెంట్రుకలను సరిపి మళ్ళీ ముడివేసుకుని శాయి వంక ఒకసారి చూసింది. లేచి కుండలో నీళ్ళు ముంతెడు తాగి ''ఏందే ఇప్పుడొచ్చినవ్ ?'' అడిగింది.

''ఏందో నాకు తెలవదు. నాయన నిన్ను కొలుకురమ్మన్నడు'' తలుపు మీద గీతలు గోళ్ళతో గీస్తూ అన్నది శాయి.

రంగమ్మకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది. శాయికి తండ్రి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాడు. మంచిరోజు చూసి పూలూ పళ్ళూ పెట్టాలని చెప్పేడు. ఇప్పుడు పదకొండు గంటలయి ఉంటుంది. సాయంత్రం ఒకవేళ పెళ్ళివారు వస్తారేమో!

రంగమ్మ ఆ ఊరికి కోడలిగా వచ్చింది. శివయ్యతో ఏ పదేళ్ళు కాపరం చేసిందో— అంతే. కలరా జాడ్యం ఆ ఊరి జనంలో సగం మందిని తీసుకుపోయింది. వాళ్ళల్లో శివయ్య ఒకడు. అతడికి ఆ గ్రామంలో ఒక ఎకరం జొన్న పొలం ఓ చుట్టుగుడిసె ఉన్నాయి. వల్లగా నిగనిగలాడే మూడు పదులు దాటని భార్య— ముసలి తల్లి ఉన్నారు.

ప్రాణికులు, ఆత్మీయులు చనిపోయి నప్పుడు గుండె పగిలేలా ఏడుస్తారు కొంత మంది. తరువాత జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఏడుస్తారు. కాని తీరికగా ఏడుస్తూ ఉండటానికి పరిస్థితులు ఒప్పవు. ఏడుస్తూనే పని చేసుకోవాలి. ఎంతటి ఆత్మీయుడు చనిపోయినా మరునాడే పనిలోకి వెళ్ళి బిడ్డల కడుపులు నింపాలి. రంగమ్మకు అటువంటి అనుభవమే కలిగింది. కాని ఇంకొక విధంగా తటస్థ పడ్డది.

ఇంట్లో చారెడు గింజల్లేవు పావుబస్తా గింజలమ్మి శివయ్యకు వైద్యంచేయించింది. కాని లాభంలేక పోయింది. ముసలమ్మ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయింది. గుక్కెడు గంజయినా కాచి నోటా పోసేవాని లేవ లేదు. పిల్లలు లేకపోయినా తనను ప్రాణంగా చూసుకున్న శివయ్య శవం కాటికి చేరాలి.

ఎట్లా ?

ఏం చెయ్యాలి ?

రంగమ్మ ఏడ్చి ఏడ్చి కళ్ళు తుడుచుకుంటుండగా ఆమె కళ్ళు చేతులకున్న మురుగుల జత మీద పడ్డాయి. ఏది తులాల మురుగులు, శివయ్య పెళ్ళినాడు మెడలో నాలుగు బంగారు గుండ్లు, చేతులకు వెండి మురుగులు జత పెట్టాడు. తులం బంగారమయినా పెట్టనా అని రంగమ్మ తల్లి రాగాలు పెట్టింది.

''మెల్లగ చేయవచ్చు'' అన్నాడు శివయ్య.

శివయ్య లాంటి బుద్ధిమంతుడు మరి దొరకడని అంతా చెప్పారు.

మూడు ముళ్ళూ మెడలో పడ్డాయి, తల మీద తలంబ్రాలు జారిపడ్డాయి రంగమ్మకు.

ఏన్నేళ్ళయినా మాట నిలుపుకోలేదని రంగమ్మ తల్లి సాధింపులు ఆ యింటి నుంచి ఈ యింటికి చేరేవి.

శివయ్య ఉగ్రుడయ్యేవాడు.

ఆ మురుగుల జత మీద కళ్ళు పడగానే కళ్ళు తుడుచుకుని దిగ్గున లేచింది రంగమ్మ. మేనమామ చేతికిచ్చి కోమటి కొట్లో తాకట్టు పెట్టి డబ్బు తెమ్మని పంపింది. మేనమామ పావయ్య చుట్టలకు తను రెండు రూపాయలుంచుకుని మిగిలిన నలభైఎనిమిది రూపాయలు రంగమ్మ చేతిలో పెట్టాడు.

ఆ రోజుల్లో అవి చూసి చూసి ఖర్చు చేసినా కుల పెద్దలను నలుగురినీ పిలిచిన నాటికి చాలనేలేదు.

పదిరోజులు దాటగానే రంగమ్మ శరీర కష్టం చేసింది. ముసలమ్మకూ తనకూ గంజి కాచుకుని కాలం వెళ్ళదీసింది. పంట రాగానే తన మురుగులు తాను ఇంటికి తెచ్చుకుంది

ఆ మురుగులు దునుక అదుకున్నామని చేతులకు వేసుకుని శివయ్యను తలుచుకుంటూ దేవుడికి దండం పెట్టింది.

అని తృప్తిగా నిట్టూర్చేవారు.

ఆదివరకటి గ్రామమూ అనిపిస్తోంది.

రచ్చబండ దగ్గర కబుర్లు, రాజకీయాల లోకి దిగి రభస చేస్తున్నాయి.

కాని రంగమ్మ మురుగుల జతతో అవసరం ఆ గ్రామానికి తీరలేదు.

"ఇదిగో రంగమ్మా, వచ్చేవారం నాటికి ఇస్తా" నంటాడొకడు.

"రంగమ్మక్కా, ఒక నెలపుడ్డి నీకు తెచ్చి యిచ్చేవరకు. పిల్లకు శోభనం" అంటాడొకరైతు.

పిల్లకు పురుడొచ్చిందంటాడొకడు.

పిల్లగాడిని పట్నం తోలాలంటాడొకడు.

ఎవరొచ్చినా రంగమ్మదొకటే మాట.

"అయ్యో! దానికేమిటంత ఇదవుతావు? తీసుకెళ్ళు" అంటుంది.

రంగమ్మ మీద ఆ గ్రామంలో ఉన్న పరపతి ఏమీ చెడలేదు. గ్రామస్థులు ఇంకా రంగమ్మను ఆశ్రయించుతునే ఉన్నారు. ఆమె మనసు వెన్నగానే ఉంది. స్ఫటికమంత స్వచ్ఛంగానే ఉంది.

రంగమ్మకు వయస్సు అరవై దాటింది. కంటి చూపు కొంచెం తగ్గినట్టుగా ఉంది. ఒక్క పూటే వండుకుంటుంది. వెలుగు ఉండగానే తింటుంది. ఇంటి ముందున్న అరుగుమీద చీకటి పడేవరకూ కూర్చుంటుంది. ఏడు గంటలకే ఇంట్లోకి వచ్చి తలుపు గొళ్ళెం పెట్టుకుంటుంది.

రంగమ్మ ఇప్పుడు చేతికింద ఒక పిల్లవాణ్ణి పెట్టుకుంది. వాడు పొలం పనులలో సహాయం చేస్తాడు. పంటలో కొంత వాడికిచ్చి మిగిలిన గింజ ఇంటికి చేర్చుకుంటుంది రంగమ్మ. చాలకపోయినా సర్దుకుంటుంది.

ఒకనాడు రంగమ్మకు చిన్నదు చిరగనిది ఇటస్త పడింది.

ఆ రాత్రే సోమయ్య తీసుకుపోయిన మురుగుల జత తీసుకువచ్చి ఇవ్వాల్సిన సమయం. కాని ఇంకా తీసుకు రాలేదు. ఇంతలో కామయ్య వచ్చి "పెద్దమ్మా, ఇల్లు కప్పించుకోవాలి. నీవు సాయపడు" అన్నాడు.

"సరే. రేపురా" అంది.

మరునాటి మధ్యాహ్నం వరకూ సోమయ్య రలేదు.

కామయ్య వస్తే ఏం చెప్పాలి?

# మురుగుల జత

రంగమ్మ వీధివంక చూస్తున్నది.

ఇంతవరకూ తీసుకు వెళ్ళిన వాళ్ళు ఇస్తానన్న వేళకే తెచ్చి యిచ్చేవారు. కాని– ఈసారి ఎందుకిలా జరిగింది?

సోమయ్య నమ్మకస్తుడు. ఒక సోమయ్య కాదు– ఈ ఊళ్లో అంతా నమ్మకస్తులే. తనవల్ల సహాయం పొందేవారు. అక్కర తీర్చుకుని తిరిగి ఇచ్చేవారు. సోమయ్యకేదో కష్టం వచ్చి ఉంటుంది. పొరుగూరికి వెళ్లాడు. రాను వీలయిందో లేదో?

రంగమ్మ భోజనం చేసి వాకిటి అరుగు మీద కూర్చుంది.

వెలుగు జారుకుంటోంది. చీకట్లు కమ్ముకుంటున్నాయి.

రంగమ్మ బాధతో కూర్చున్న చోటి నుంచి లేవబోతుండగా కామయ్య వచ్చాడు.

"ఏం పెద్దమ్మా?"

"నాయనా, సోమయ్య తీసుకువెళ్లాడు. నిన్న తిరిగి ఇవ్వాల్సిన రోజు. కాని ఎందుకో రాలేదు. పొరుగూరు వెళ్ళాడు. అక్కడేదో అకాల వర్షంపడి ఏర్లు పొంగి వాగులు నిండినాయట. ఇందాక ఎవరోవచ్చి చెప్పారు" అంది.

"అది నిజమే కావచ్చు పెద్దమ్మా, నా సంగతి చూడు. నా భార్యకు నీళ్ళాడ పొద్దులు. ఇల్లు కురుస్తున్నది ముందే కప్పుకోవాలి. ఆ పైన కుదరదు."

"అవును బాబూ. అందరికీ అవసరమే. రాగానే నీకే ఇస్తాను. అతడు తప్పకుండా తెస్తాడు."

"అయితే రేపురానా పెద్దమ్మా?"

"రా నాయనా!" ఆమె తలుపు గొళ్ళెంపెట్టి లోపలికివెళ్ళి, చెంబెడు గటక తాగి పడుకుంది.

కామయ్య రంగమ్మకు భర్త వైపు దూరపు చుట్టం. రంగమ్మ అందరి తలలో నాలుకలా ఉండటం అతడికి ఇష్టం లేదు. ఆ చుట్టు గుడిసె అయినా అలా గట్టిగా ఉండటం అతడి కంటికి మిరమిరగా ఉంది. ఆ కొద్ది గింజలతో కడుపు నింపుకుని ఒక మహారాణిలా ఆ గ్రామంలో పరిపాలన చేస్తున్నదే రంగమ్మ అని మనసులో బాధ.

దిక్కులేని ఒక ఆడదానికి ఇంత పరపతా?

అందరూ పొద్దున లేచి రంగమ్మను తలుచుకోవటమా?

కాని కామయ్య కూడా అలా ఆమెవల్ల సహాయం పొందినవాడే. కాని మనసులో కంటగింపుగా ఉంటోంది.

రాత్రి పన్నెండు గంటల వేళ- ఒక నిప్పుపుల్ల చుట్టు గుడిసె మీద కాల్చి పడేశాడు.

తెల్లవారేసరికి ఊరంతా గుప్పుమంది. రంగమ్మ చుట్టు గుడిసె మీద ఎవరో నిప్పు పడేశారని, కపంతా కాలి కూలిపోయిందని.

గ్రామస్థులంతా ఒక్కరొక్కరే పరుగు తీశారు గుడిసె దగ్గరికి. కన్నీటితో కాలిపోయిన చెత్తంతా తోస్తే దూలాల క్రింద రంగమ్మ కాలిన వంకాయలా ఉంది.

గ్రామస్థులంత ఆమెను దేవతలా ఊరేగించి ఊరి బయట సమాధి చేశారు. వాళ్ళు ఇళకు తిరిగి రాలేక అక్కడే నాలుగు గంటలసేపు కూర్చుని ఆమె ఆదుకున్న కుటుంబాలను గురించి చెప్పుకున్నారు. ఎవరెవరిని ఎటువంటి కష్టాలనుంచి తప్పించిందో నెమరువేసుకున్నారు. కన్నీరు కార్చారు. దిక్కులేని వాళ్ళమయ్యామని వాపోయారు

ఏన్నాళ్ళయినా ఎన్నేళ్ళయినా ఆ గ్రామంలో సాయంత్రం కాగానే "నాయనా! నీవింతగా అడగాలా? తీసుకువెళ్ళు. నీ అక్కర తీర్చుకో. ఇబ్బంది పడకు. నా మురుగుల జత వుంది చూశావా? దాన్ని మంచి మనసుతో శివయ్య పెళ్ళినాడు పెట్టాడు. ఆ మురుగుల జతలో శివయ్య మనసుంది. ఎప్పుడూ వాటితో మంచిపనులే జరుగుతాయి" అని గాలి ఈలలు వేసినట్టుగా– సాయంత్రపు వేళలో మల్లెలు విచ్చి మగం ధాన్ని ఊరిమీద వెదజల్లినట్టుగా – పాంథుడు చల్లటి పానీయం త్రాగిన తరువాత సేదదీరినట్టుగా రంగమ్మ మాటలు సమాధి నుండి వెడలినట్టుగా అనిపిస్తుంది.

రంగమ్మ మురుగుల జత వాళ్ళ కళ్ళకు ధవళ కాంతులు వెదజల్లుతూ ఎవరినో ఆపద నుండి కాపాడుతున్నట్టుగా కనబడుతుంది.